సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 9 । జూన్ । 2024



కూరగాయల ధరలు పైపైకి..

జిల్లాలో కూరగాయల ధరలు చుక్కలనంటుతున్నాయి. మార్కెట్‌లో ఏది కొనాలన్నా రేట్లు భగ్గుమంటున్నాయి. పక్షంరోజుల వ్యవధిలోనే ధరలు రెట్టింపయ్యాయి. 9లో▸

మూడ్రోజులు గేటు మూసివేత

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని తాంసి బస్టాండ్ సమీపంలోగల రైల్వేగేటును మూడ్రోజులపాటు మూసివేయనున్నట్లు దక్షిణమధ్య రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ట్రాక్ మరమ్మతు పనుల నేపథ్యంలో ఈనెల 10న సాయంత్రం 6నుంచి 12న సాయంత్రం 6గంటల వరకు గేటు మూసివేయనున్నట్లు పేర్కొన్నారు. పట్టణ ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

గరిష్ఠం/కనిష్ఠం
37.0/27.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం పూర్తిగా మేఘావృతమవుతుంది. వాతావరణం చల్లబడుతుంది. జిల్లాలో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

సివిల్ కోర్టు భవన నిర్మాణ స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న జడ్జి ప్రభాకరరావు

బోథ్: బోథ్ జూనియర్ సివిల్ కోర్టు నూతన భవన నిర్మాణ స్థలాన్ని జిల్లా జడ్జి ప్రభాకరరావు శనివారం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బీ హుస్సేన్‌తో కలిసి పరిశీలించారు. త్వరలోనే భవన నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. వారి వెంట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వామన్‌రావు దేశ్‌పాండే, అంగద్ కేంద్రే, మోహన్‌రావ్, పంద్రం శంకర్, ఆడెపు హరీశ్, కుమ్మరి విజయ్, జమీర్, ధమ్మపాల్, కోర్టు సూపరింటెండెంట్ శేఖర్‌రెడ్డి, ఎస్సై రాము తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీలు

ఆదిలాబాద్: కేకే స్విమ్మింగ్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం స్విమ్మింగ్ పూల్‌లో ఆదివారం జిల్లాస్థాయి స్విమ్మింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు కోచ్ కొమ్ము కృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 5గంటలకు ట్యూబ్ సహాయంతో 5 నుంచి 14 సంవత్సరాల లోపు వారికి, ట్యూబ్ సహాయం లేకుండా 5 నుంచి 18 సంవత్సరాల వారికి పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనేవారు 9494945402 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

10న సర్టిఫికెట్ వెరిఫికేషన్

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో భాగంగా ఈ నెల 10న భాషా పండితులు, పీఈటీల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని డీఈవో ప్రణీత ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని విద్యార్హతలతో ఒక జత జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

జైలును సందర్శించిన జిల్లా జడ్జి ప్రభాకరరావు



సిబ్బందితో మాట్లాడుతున్న ప్రభాకరరావు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని జిల్లా జైలును జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే ప్రభాకరరావు శనివారం సందర్శించారు. ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి జైలు పరిసరాలు, డైనింగ్ హాల్, వంట గది, ఖైదీల బ్యారక్‌లను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కేసులకు సంబంధించిన వివరాలను జైలు సిబ్బందితో ఆరా తీశారు. మండుటెండల్లోనూ జైలు ఆవరణ పచ్చదనంతో ఉండడంతో సిబ్బందిని అభినందించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య, జిల్లా జైలు సూపరింటెండెంట్ పీ అశోక్‌కుమార్ తదితరులున్నారు.

లోక్‌అదాలత్‌కు స్పందన

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన లోక్‌అదాలత్‌కు స్పందన లభించింది. పలువురు కక్షిదారులు రాజీద్వారా కేసులు పరిష్కరించుకోగా జిల్లా జడ్జి ప్రభాకరరావు, ఎస్పీ గౌస్ ఆలం వారికి రాజీ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జడ్జిలు, న్యాయవాదులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

రామోజీరావు సేవలు చిరస్మరణీయం

ఆదిలాబాద్‌టౌన్: పద్మభూషణ్ పురస్కార గ్రహీత చెరుకూరి రామోజీరావు మరణం తీరని లోటని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

పలకరించిన తొలకరి

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల్లో శనివారం వర్షం కురిసింది. తొలకరి పలకరించడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తూ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈదురుగాలుల తీవ్రతకు జిల్లా కేంద్రంలోని శాస్త్రీ మందిర్‌పై, కలెక్టరేట్ అవుట్ గేట్ వద్ద వృక్షాలు విరిగిపడ్డాయి.

జంప్ గెలిపిస్తోంది!

- ఎన్నికలపుడే పార్టీ వీడుతున్న 'గోడం'
- 2014లో టీడీపీ నుంచి టీఆర్‌ఎస్‌లోకి..
- అనూహ్యంగా ఎంపీగా ఎన్నికైన నగేశ్
- తాజాగా బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలోకి..
- రెండోసారి గెలుపొందిన గోండు నేత



ఆదిలాబాద్‌లో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో ఎంపీ గోడం నగేశ్‌తో ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఇతర నాయకులు (ఫైల్)

సాక్షి, ఆదిలాబాద్: పార్లమెంట్ ఎన్నికలకు కొద్దిరోజుల ముందే ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి జంప్ చేసిన గోడం నగేశ్‌కు కలిసివస్తోంది. గత మూడు వరుస ఎన్నికల్లో బరిలో నిలుస్తూ వచ్చిన ఆయనకు రెండుసార్లు ఇలా పార్టీ మారినప్పుడే విజయం వరించింది. టీడీపీ నుంచి రాజకీయ ప్రస్థానం మొదలు కాగా, 2014లో సరిగ్గా పార్లమెంట్ ఎన్నికలకు ముందే టీఆర్‌ఎస్‌లో చేరారు. అప్పుడు ఘనవిజయం సాధించారు. ఆ తర్వాత 2019 ఎన్నికల్లో మరోసారి టీఆర్‌ఎస్ నుంచి బరిలోకి దిగారు. అప్పుడు బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావు చేతిలో పరాజయం పాలయ్యారు. తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో సరిగ్గా ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే ముందే ఆయన బీజేపీ కండువా కప్పుకొన్నారు. ఆ తర్వాత ఆయన అభ్యర్థిత్వం ఖరారు కావడం, ఎన్నికల్లో మంచి మెజార్టీతో గెలుపొందడం జరిగిపోయాయి.

మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో..

ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా బీజేపీ నుంచి గెలుపొందిన గోడం నగేశ్ మూడు దశాబ్దాలుగా క్రియాశీలక రాజకీయాల్లో ఉన్నారు. తండ్రి గోడం రామారావు నుంచి రాజకీయ వారసత్వం పునికిపుచ్చుకున్నప్పటికీ సుదీర్ఘకాలం ఈ రంగంలో కొనసాగుతున్నారు. తనదైన పాత్ర నిర్వహించడం ద్వారా ఇది సాధ్యమైందని ఆయన శ్రేయోభిలాషులు అభిప్రాయపడుతుంటారు. ఒక విధంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల్లో ఇటు ఎమ్మెల్యేగా, ఎంపీగా వ్యవహరించిన అనుభవం కొద్దిమందికే ఉండగా అందులో నగేశ్ కూడా ఒకరుగా నిలుస్తున్నారు.

రాష్ట్ర మంత్రిగా అనుభవం..

అప్పట్లో నగేశ్ తండ్రి గోడం రామారావు ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తి నుంచి రాజకీయాల్లోకి వచ్చారు. బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా రెండుసార్లు గెలుపొందారు. ఎన్టీఆర్ కేబినెట్‌లో గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా వ్యవహరించారు. 1994 శాసనసభ ఎన్నికల సమయంలో గోడం రామారావు మరోసారి టీడీపీ టికెట్ ఆశించారు. ఆ సమయంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా వ్యవహరిస్తున్న గోడం నగేశ్ కూడా రాజకీయాలపై ఆసక్తి కనబర్చారు. అందుకు అనుగుణంగా అడుగులు వేశారు. అప్పట్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల్లో కీలక చక్రం తిప్పే ఓ నేత ద్వారా గోడం నగేశ్ టీడీపీ టికెట్ సాధించేందుకు తన తండ్రినే ఎదిరించారని రాజకీయ వర్గాల్లో చర్చ ఉంది. ఇక అప్పటి నుంచి పొలిటికల్‌గా ఆయన వెనుదిరిగి చూడలేదు. బోథ్ నియోజకవర్గం నుంచి 1994, 1999లలో వరుసగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత మరోసారి 2009లో టీడీపీ అభ్యర్థిగా బోథ్ నుంచే విజయం సాధించారు. మొత్తంగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. కాగా, మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు ఎన్టీ రామారావు కేబినెట్‌లో కొద్దికాలం గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా పని చేశారు. ఆ తర్వాత చంద్రబాబు కేబినెట్‌లోనూ ఆయన అదే శాఖ బాధ్యతలు నిర్వర్తించారు. ఇలా రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా పని చేసిన విశేష అనుభవం కూడా గోడం నగేశ్‌కు ఉంది. తాజాగా బీజేపీ ఎంపీగా గెలిచిన ఆయన కేంద్ర మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. ప్రధానంగా దక్షిణ భారత దేశంలో ఎస్టీ నియోజకవర్గాల పరంగా గెలుపొందిన కొద్దిమంది ఎంపీల్లో నగేశ్ ఉండడంతో ఏదైనా అనూహ్యం జరిగితే తనకు మంత్రి పదవి దక్కుతుందని 'గోడం' ఆశిస్తున్నారు.

ఎంపీగా నగేశ్ సాధించిన ఓట్లు

2014 (టీఆర్‌ఎస్)	2024 (బీజేపీ)
4,30,847 (40.82 శాతం)	5,68,168 (45.98 శాతం)

గ్రూప్–1 పరీక్షకు సర్వం సిద్ధం

- 6,729మంది అభ్యర్థులు.. 18 కేంద్రాలు
- నిమిషం లేటైనా అనుమతి నిరాకరణ

కైలాస్‌నగర్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు జిల్లా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. పరీక్షను పారదర్శకంగా నిర్వహించేలా.. కేంద్రాల్లో అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా 6,729 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానుండగా జిల్లా కేంద్రంలో 18 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష నిర్వహించనున్నారు. అభ్యర్థుల బయోమెట్రిక్ హాజరు నమోదు చేయనున్నందున ఉదయం 9గంటలకే పరీక్షాకేంద్రాల్లోకి అనుమతిస్తారు. 10 గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోకి అనుమతించరు. పరీక్ష నిర్వహణ కోసం ఐదుగురు రూట్ ఆఫీసర్లతో పాటు బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, అబ్జర్వర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. పరీక్షల నిర్వహణపై వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అభ్యర్థులకు ముందుగానే ఓఎంఆర్ షీట్లు అందించనున్నారు. అయితే బుక్‌లెట్ మాత్రం 10.30గంటలకు బెల్ మోగిన తర్వాతే తెరవాల్సి ఉంటుంది. సీసీ కెమెరాల నిఘాలో పరీక్ష నిర్వహించనున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. పకడ్బందీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. తనిఖీలు చేసేందుకు మహిళలు, పురుషుల కోసం కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున కేంద్రాల్లో తాగునీటి వసతితో పాటు ప్రాథమిక చికిత్స అందించేలా వైద్య బృందాలను అందుబాటులో ఉంచుతున్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టనున్నారు.



డిగ్రీ కళాశాలలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సిబ్బంది

అభ్యర్థులకు ముఖ్య సూచనలు

- పరీక్షాకేంద్రంలోకి క్యాలిక్యులేటర్లు, పేపర్లు, సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు, పెన్‌డ్రైవ్‌లు, బ్లూటూత్ పరికరాలు, చేతిగడియారం, లెక్కల పుస్తకం, లాగరిథమ్ పుస్తకం, పర్సు, హ్యాండ్‌బ్యాగ్, రైటింగ్ ప్యాడ్స్, ఆభరణాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, రికార్డింగ్ పరికరాలను అనుమతించరు. అభ్యర్థులు వాటిని తీసుకురావద్దు.
- అభ్యర్థులు బూట్లు కాకుండా చెప్పులు ధరించి మాత్రమే పరీక్షాకేంద్రాలకు హాజరు కావాలి. మహిళా అభ్యర్థులు చేతులకు మెహిందీ, తాత్కాలిక టాటూస్ వేసుకోకూడదు.
- పరీక్ష ప్రారంభమైన తర్వాత ప్రతీ 30 నిమిషాలకు ఒకసారి బెల్ మోగించి లేదా ఇన్విజిలేటర్ ద్వారా సమయాన్ని చెబుతారు.
- బయోమెట్రిక్ ఇన్విజిలేటర్ ద్వారా అభ్యర్థి తన బయోమెట్రిక్‌ను క్యాప్చర్ చేసే వరకూ పరీక్షాకేంద్రం నుంచి బయటకు రాకూడదు. ఎవరైనా తన బయోమెట్రిక్‌ను ఇవ్వకపోతే వారి ఆన్సర్ షీట్‌ను మూల్యాంకనం చేయరనే విషయాన్ని గుర్తించాలి.

కేంద్రాల వద్ద పకడ్బందీ బందోబస్తు

ఆదిలాబాద్‌టౌన్: ఆదివారం నిర్వహించనున్న గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు జిల్లా కేంద్రంలోని 18 పరీక్షాకేంద్రాల వద్ద పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక ఎస్టీయూ భవన్‌లో కేంద్రాల వద్ద విధులు నిర్వహించనున్న అధికారులు, సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. కేంద్రాల వద్ద సీఐ/ఎస్సై స్థాయి అధికారులను ఇన్‌చార్జీలుగా నియమించి, 10 మంది సిబ్బందిని కేటాయించనున్నట్లు తెలిపారు. 10 గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోనికి అభ్యర్థులను అనుమతించవద్దని సూచించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. సమీపంలో ర్యాలీలు, సభలు నిర్వహించరాదని, గుంపులుగుంపులుగా తిరగవద్దని తెలిపారు. పట్టణంలోని సీఐలు పరీక్ష పూర్తయ్యేంతవరకు గస్తీ నిర్వహిస్తూ పర్యవేక్షించాలని సూచించారు. కేంద్రాల వద్ద ఎస్పీ, అదనపు ఎస్పీ, డీఎస్పీ స్థాయి అధికారులతో నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ (పరిపాలన) బీ సురేందర్‌రావు, డీఎస్పీలు శ్రీనివాస్, జీవన్‌రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, పట్టణ సీఐలు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ గౌస్ ఆలం

సేవలందించని కేంద్రాలపై చర్యలు

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని తాంసి బస్టాండ్, కలెక్టర్ కార్యాలయంలోని మీసేవ కేంద్రాలను ఈడీఎం రవి శనివారం పరిశీలించారు. కేంద్రాల్లోని లావాదేవీలు, ప్రజలకు అందిస్తున్న సేవలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. మీసేవ వీఎల్‌ఈలకు మంజూరు చేసిన స్థలంలోనే కేంద్రాలు నిర్వహించాలని ఆదేశించారు. స్టేషనరీ రిజిస్టర్ తప్పనిసరిగా అప్డేట్‌గా ఉండాలని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా మీసేవ ఆపరేటర్ వినియోగదారులకు రశీదుపై టీఎస్‌కు బదులు టీజీటీఎస్ స్టాంప్ వేశాకే అందించాలని సూచించారు. మీసేవ ఆపరేటర్లు సర్వీసులు ఇవ్వకుండా జీరో లావాదేవీ లుంటే వాటిపై రాష్ట్ర ఈఎస్డీ ఆఫీస్ ఆదేశాల మేరకు తగినచర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.



కేంద్రంలోని రికార్డులు పరిశీలిస్తున్న రవి

సాగులో విత్తనాల ఎంపికే కీలకం

- దుక్కిలో తేమ లేకుంటే విత్తొద్దు
- అందుబాటులో విత్తనాలు, ఎరువులు
- విరివిగా క్రిమిసంహారకాలు వద్దు
- సాక్షి 'ఫోన్‌ఇన్'లో డీఏవో పుల్లయ్య



'ఫోన్‌ఇన్'లో మాట్లాడుతున్న పుల్లయ్య

కైలాస్‌నగర్: 'విత్తనాల ఎంపికలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. లైసెన్స్ లేని వారి నుంచి కొనుగోలు చేస్తే నష్టపోతారు. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసి రశీదులు పొందాలి. రశీదుతో పాటు విత్తన ప్యాకెట్ల కవర్లను పంట కాలం ముగిసేదాకా భద్రపరుచుకోవాలి. 60 నుంచి 70 మిల్లీ మీటర్ల వర్షపాతం కురిశాకే విత్తనాలు నాటుకోవాలి' అని జిల్లా వ్యవసాయాధికారి డీ పుల్లయ్య సూచించారు. జిల్లాలో విత్తనాలు, ఎరువులు సరిపడా అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. నకిలీ విత్తనాలు విక్రయించినా, విత్తనాల కృత్రిమ కొరత సృష్టించినా, ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో శనివారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఫోన్ ఇన్' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి రైతులు ఫోన్ చేసి తమ సందేహాలను డీఏవో దృష్టికి తీసుకువచ్చి నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో ఏడీ రమేశ్, టెక్నికల్ ఏవో శివకుమార్ పాల్గొన్నారు.

రైతు: నకిలీ విత్తనాలను ఎలా గుర్తించాలి?
– తాండ్ర శ్రీనివాస్, బజార్‌హత్నూర్

డీఏవో: లైసెన్స్ లేని అనధికార వ్యక్తులు లూజ్‌గా, తెల్లసంచుల్లో విక్రయిస్తే వాటిని నకిలీ విత్తనాలుగా పరిగణించాలి. తయారీ తేదీ, లాట్ నంబర్, క్యూఆర్ కోడ్, జర్మినేషన్ పర్సంటేజీ, మార్కెటింగ్ చేసే కంపెనీ తదితర వివరాలు ప్యాకెట్‌పై లేకుంటే అవి నకిలీ విత్తనాలే. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలి.

రైతు: పత్తి విత్తనాలు ఎప్పటి వరకు విత్తుకోవాలి? డీఏపీ ఏ సమయంలో వేయాలి. మొక్కజొన్న ఎప్పటివరకు సాగు చేయొచ్చు?
– చెట్ల సుభ్‌దేవ్, బజార్‌హత్నూర్

డీఏవో: పత్తి విత్తనాలు విత్తే సమయంలో డీఏపీ వేయొచ్చు. ఆఖరు దుక్కిలో వేసి రోటోవేటర్‌తో చదును చేసినట్లయితే అది భూమిలోకి దిగి నెమ్మదిగా కరుగుతుంది. పత్తి జూన్ రెండో వారం వరకు, మొక్కజొన్న ఆగస్టు వరకు సాగు చేయవచ్చు.

రైతు: సబ్సిడీ సోయా విత్తనాలను ప్రభుత్వం సరఫరాచేసే అవకాశం ఉందా? బయట విక్రయించేరాశి 659 విత్తనాలు మంచివేనా?
– జగ్నాక్ మారుతి, పార్డి బీ, బోథ్

డీఏవో: సబ్సిడీ సోయా విత్తనాలను సరఫరా చేసే అవకాశం లేకపోవచ్చు. లైసెన్స్ డీలర్ల వద్ద లభించే రాశి 659విత్తనాలు మేలైనవే.

రైతు: రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లేదు. డీలర్లు కృత్రిమ కొరత సృష్టించి విత్తనాలు లభించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. విక్రయించిన జొన్నల డబ్బులు ఎప్పుడు చెల్లిస్తారు?
– మహేందర్, సాంగిడి, బేల

డీఏవో: అధికారులంతా మొన్నటిదాకా ఎన్నికల విధుల్లోనే ఉన్నారు. ఇక నుంచి ప్రతీ మంగళవారం రైతువేదికల్లో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పిస్తారు. విత్తనాల కృత్రిమ కొరత సృష్టించే డీలర్లపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. జొన్నల డబ్బుల చెల్లింపు విషయం మార్క్‌ఫెడ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

రైతు: మిర్చి సాగు చేయాలనుకుంటున్నాను. ఇందుకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయా?
– కోసేరావు, ఇచ్చోడ

డీఏవో: పచ్చిరొట్ట విత్తనాలు వరి సాగు చేసే రైతులే ఎక్కువగా వినియోగిస్తారు. జిల్లాలో వరి సాగు లేనందున జనుము, జీలుగ విత్తనాలు అందుబాటులో లేవు. అవసరమైతే నిర్మల్ జిల్లా నుంచి తెప్పించుకోవాలి.

రైతు: పత్తి విత్తనాలు ఏ సమయంలో నాటితే మొలకెత్తుతాయి. మొలకెత్తాక గడ్డి మందు పిచికారీ చేయొచ్చా? నకిలీవిత్తనాలు అమ్మే వారిపై చర్యలు తీసుకుంటున్నారా?
– వినిల్‌కుమార్, బజార్‌హత్నూర్,
– పాల కార్తీక్, వదూర్, నేరడిగొండ

డీఏవో: 60 నుంచి 70 మిల్లీమీటర్ల వర్షపాతం కురిశాకే పత్తి విత్తనాలు నాటుకోవాలి. భూమిలో తేమశాతం ఉంటే 10 రోజుల వరకు వర్షం కురవకపోయినా గింజ ఉబ్బి మొలకెత్తుతుంది. భూమిలో తేమ శాతం ఉన్నప్పుడే గడ్డి మందు పిచికారీ చేయాలి. నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై కేసులు నమోదు చేస్తాం. వారి లైసెన్స్ రద్దుకు చర్యలు తీసుకుంటున్నాం. పోలీస్, రెవెన్యూ, వ్యవసాయశాఖల అధికారులతో ప్రత్యేక కమిటీలు వేసి విత్తన దుకాణాల్లో తనిఖీలు చేయిస్తున్నాం.

రైతు: ఏ రకం సోయా విత్తనం మంచిది? అధికారికంగా విత్తనాలు లభ్యమవుతాయా?
– రమేశ్, అడెగామ కే, ఇచ్చోడ

డీఏవో: కరీష్మ, విక్రాంత్, జేఎస్–335, కేడీఎస్–726, ఏఏయూఎస్–612 లాంటి సోయా రకాలన్నీ ఉత్తమమైనవే. సోయా విత్తే సమయంలో సూపర్‌పాస్ఫెట్‌ను కలిపి వేస్తే అధిక దిగుబడి వస్తుంది. ఇంకా మేలైన రకాలు అవసరముంటే జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లోగల కేవీకేలోని వ్యవసాయ శాస్త్రవేత్తలను సంప్రదించాలి.

రైతు: రాశి 659 విత్తనాలే కాకుండా ఇంకా ఏయే రకం విత్తనాలు సాగు చేస్తే పంట దిగుబడి వచ్చే అవకాశముంటుంది.
– రాజేశ్వర్, కామగిరి, ఇచ్చోడ

డీఏవో: ప్రదీప్, మోక్ష, ధన్‌దేవ్, మ్యాజిక్, స్వీఫ్ట్ ప్రైమ్ లాంటి రకాలన్నీ నాణ్యమైనవే. లైసెన్స్ డీలర్లు విక్రయించే పత్తి విత్తనాలన్నీ ప్రభుత్వం సర్టిఫైడ్ చేసినవే. కేవలం కంపెనీ విత్తనరకంపై ఆధారపడితేనే దిగుబడి రాదు. పంటల సాగులో కలుపు నివారణ, అవసరం మేరకు పురుగు మందుల పిచికారి లాంటి యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చు. ఎప్పుడూ ఒకే రకం విత్తనంపై ఆధారపడొద్దు. ఇతర రకాలూ సాగు చేయాలి.

రైతు: యూరియా, డీఏపీ అందుబాటులో లేక ఇచ్చోడ నుంచి తెచ్చుకోవాల్సి వస్తోంది. రాశి విత్తనాలు కూడా దొరకడం లేదు.
– దత్తు, సిరికొండ

డీఏవో: సిరికొండ మండలంలో పీఏసీఎస్ కేంద్రం లేదు. ఇచ్చోడలోనే విక్రయిస్తున్నారు. త్వరలోనే సహకార శాఖ అధికారులతో మాట్లాడి సిరికొండలో పీఏసీఎస్ కేంద్రం ఆధ్వర్యంలో ఎరువులు అందుబాటులో ఉంచుతాం. విత్తనాలకు కొరత లేదు. పొన్న ఎక్స్‌రోడ్‌లోని షాపులో రాశి 659 విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.

రైతు: కంది విత్తనాలు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయి? ఎక్కడ దొరుకుతాయి?
– లక్ష్మణ్, వడ్డాడి, తాంసి

డీఏవో: వారం రోజుల్లో వచ్చే అవకాశముంది. వచ్చిన వెంటనే మీడియా ద్వారా రైతులకు సమాచారమిస్తాం. సంబంధిత ఏవోలు, ఏఈవోలను సంప్రదించి అవసరమైన విత్తనాలు తీసుకోవచ్చు.

రైతు: సోయా విత్తన శుద్ధి చేసుకోవచ్చా? దీని ద్వారా ఏ మేరకు ప్రయోజనం ఉంటుంది?
– మొరే నీలకంఠ, సిరికొండ

డీఏవో: థైరాన్, క్యాప్టమ్, రైజోబియం లాంటి రసాయనాల ద్వారా సోయా విత్తనశుద్ధి చేసుకోవచ్చు. విత్తనశుద్ధి ద్వారా భూమిలోని క్రిమికీటకాలు విత్తనాలను తినకుండా ఉంటాయి. తద్వారా వందశాతం జర్మినేషన్ వచ్చే అవకాశముంటుంది.

97మంది హోంగార్డుల బదిలీ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో హోంగార్డుల బదిలీల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. శనివారం స్థానిక పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ గౌస్ ఆలం ఆధ్వర్యంలో ప్రక్రియ నిర్వహించారు. నిర్మల్ జిల్లా నుంచి 62మంది, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి 35మంది జిల్లాకు రానున్నారు. వారి స్థానంలో ఈ జిల్లాలో పనిచేసే 97మంది హోంగార్డులకు లక్కీ లాటరీ ద్వారా బదిలీల ప్రక్రియ నిర్వహించారు. ఈ ప్రక్రియలో సాధారణ విధులు నిర్వర్తించే హోంగార్డులు, వాహన డ్రైవర్లు, దోభీలు, వంట పని చేసేవారు, వివిధ రంగాల్లో విధులు నిర్వహిస్తున్న మొత్తం 97 మందిలో 95 మందిని నిర్మల్, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలకు బదిలీ చేయగా, ఇద్దరిని ఆదిలాబాద్ జిల్లాకు కేటాయించినట్లు ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. బదిలీల ప్రక్రియను హోంగార్డుల సమక్షంలో పారదర్శకంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ బీ సురేందర్‌రావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీలు ఎల్.జీవన్‌రెడ్డి, పోతారం శ్రీనివాస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు నవీన్, టీ మురళి, చంద్రశేఖర్, పోలీస్ కార్యాలయ సూపరింటెండెంట్ సంజీవ్, హోంగార్డ్ యూనిట్ అధికారి రమేశ్, రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



హోంగార్డుల బదిలీల ప్రక్రియ నిర్వహిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

క్లుప్తంగా

చంద్రబాబును కలిసిన నగేశ్


చంద్రబాబుతో ఎంపీ, ఎమ్మెల్యే

ఆదిలాబాద్: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును శనివారం ఢిల్లీలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీలో అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి విజయం సాధించడం పట్ల ఆయనకు ఎంపీ అభినందనలు తెలిపారు. ఎంపీగా ఎన్నిక కావడం పట్ల నగేశ్‌కు చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ బండి సంజయ్ ఉన్నారు.

కోర్టు కాంప్లెక్స్‌లో చోరీకి యత్నం

ఎదులాపురం: జిల్లాకేంద్రంలోని కోర్టు కాంప్లెక్స్‌లో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు శనివారం చోరీకి యత్నించారు. హెడ్ కానిస్టేబుల్ కథనం ప్రకారం.. ఉదయం 5 గంటల ప్రాంతంలో ఇద్దరు కోర్టు కాంప్లెక్స్‌లోని మోటార్, రెండు పైపులను రిక్షాలో పెడుతుండగా శబ్దం వచ్చింది. అక్కడే ఉన్న అటెండర్ శ్రీనివాస్ గమనించి అరిచాడు. దీంతో వారు మోటార్, పైపులు, రిక్షాను అక్కడే వదిలేసి పారిపోయాడు. అటెండర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

గుట్కా తరలిస్తున్న వ్యక్తిపై కేసు

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ నుంచి ఉట్నూర్ వైపు అక్రమంగా నిషేధిత గుట్కా తరలిస్తున్న వ్యక్తిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ..ఉట్నూర్ మండలం శ్యామ్‌పూర్‌కు చెందిన అతిక్ దావూద్ ఢుంగె బైక్‌పై ఆదిలాబాద్ నుంచి ఉట్నూర్ వైపు గుట్కా తరలిస్తున్నాడు. పక్కా సమాచారంతో అంబేడ్కర్ చౌక్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డాడు. సుమారు రూ.32 వేల విలువ గల గుట్కాను స్వాధీనం చేసుకున్నామన్నారు. పోలీసు కానిస్టేబుళ్లు తదితరులు ఉన్నారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య


నాగేశ్(ఫైల్)

భీమిని: కన్నెపల్లి మండలం జజ్జరవెల్లి పంచాయతీలో వడుగూరి నాగేశ్ (30) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాలు.. నాగేశ్ అదే గ్రామానికి చెందిన విజయతో ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇద్దరి మధ్య ఇటీవల గొడవలు జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. తిరిగి రావడం లేదని మనస్తాపం చెందాడు. శనివారం ఉదయం ఇంట్లో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బెల్లంపల్లి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య విజయ, ఇద్దరు కుమారులు ఉన్నారు. తండ్రి రఘురాం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జీవన భారం..ఉపాధి ప్రశ్నార్థకం!

- ప్రత్యామ్నాయం లేక అవసోపాలు
- చేతినిండా పనిలేక బీడీ కార్మికుల ఇక్కట్లు


బీడీలు చుడుతున్న మహిళా కార్మికులు (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: రేయింబవళ్లు చెమటోడ్చి రెక్కలు ముక్కలు చేసుకుని బీడీలు చుట్టే కార్మికుల కష్టం అంతాఇంతకాదు. ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా కుటుంబ పోషణ భారం మోసే మహిళలు చాలామంది ఉన్నారు. ఈ రంగంపై ఆధారపడిన వారికి ప్రస్తుతం ఉపాధి కరువు అవుతోంది. బీడీల తయారీని జీవనాధారంగా మార్చుకున్న ఎంతోమంది ప్రత్యామ్నాయం లేక అవసోపాలు పడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా వెతలు అనుభవిస్తున్న కార్మికులు బతుకు బండి లాగేందుకు అష్ట కష్టాలు పడుతున్నారు. తమ కష్టాలు తీర్చి గట్టెక్కిస్తామని చెబుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు నాయకులు తమకు నమ్మకం కలిగించలేకపోతున్నారు. ఆకు(తునికి)ను ప్రత్యేక నమూనాలో కత్తిరించి, పొడి తంబాకును అందులో వేసి ఓపిగ్గా మడిచి దాని చుట్టూ దారం కడితే అప్పుడు బీడీ తయారవుతుంది. ఇలా చెమటోడ్చి శ్రమించే ఎంతోమంది కార్మికులు చేతినిండా పని లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈ ప్రాంతంలో బీడీ పరిశ్రమ..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1.20 లక్షల మందికి పైగా బీడీ కార్మికులు ఉన్నారు. నిర్మల్, మంచిర్యాల, ఆదిలాబాద్ ప్రాంతాల్లో బీడీ పరిశ్రమ విస్తరించి ఉంది. పేద, మధ్య తరగతి కుటుంబాల మహిళలు బీడీ చుడుతూ ఉపాధి పొందుతున్నారు. బీడీలకు బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ తగ్గిపోవడంతో తగినంత పని దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కుటుంబ పోషణ భారంగా మారింది. మరోవైపు కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా పథకాల ప్రయోజనాలు పొందడం లేదని వాపోతున్నారు. నిబంధనల ప్రకారం ప్రతీనెలలో 26 రోజులు కనీసం పని దినాలు కల్పించాల్సి ఉన్నా, ప్రస్తుతం 15 రోజులు మించి పనులు ఉండడం లేదు. ప్రతీఒక్కరికి రోజుకు వెయ్యి బీడీలకు సరిపడా ఆకు, తంబాకు అందించాల్సి ఉన్నా కంపెనీల యాజమాన్యాలు పూర్తిస్థాయిలో ఉపాధి కల్పించలేకపోతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శివాజీ దేశాయి చారుబాయ్ తదితర కంపెనీలు 40 వరకు ఉన్నాయి. వీటి పరిధిలో దాదాపు 13 బ్రాంచ్‌లు పనిచేస్తున్నాయి. 1.20 లక్షలమంది కార్మికులు ప్రస్తుతం బీడీలు చుడుతున్నారు. వీరిలో సుమారు 75 వేల మందికి పీఎఫ్ ఉండగా, మిగతా వారికి ఈ సౌకర్యం లేదు.

- గతంలో పదేళ్లు పనిచేస్తే 50 ఏళ్లు నిండిన తర్వాత పింఛన్ అమలయ్యేది. ప్రస్తుతం 3,365 రోజులు పనిచేస్తేనే పింఛన్ అందేలా జీవో సవరించారు.

సమస్యలు పరిష్కరిస్తే మేలు..

- బీడీ రంగంపై జీఎస్టీ వస్తుసేవల పన్ను భారంగా మారింది. వెంటనే మినహాయింపు ఇవ్వాలి.
- కార్మికుల పింఛన్ రూ.వెయ్యి వరకు ఉంది. ప్రతినెల రూ.5వేల పింఛన్ అమలు చేయాలని డిమాండ్ ఉంది.
- ఈఎస్ఐ వర్తింపజేయడంతోపాటు మెరుగైన వైద్యం అందించేలా జిల్లా కేంద్రాల్లో 100 పడకల ఆసుపత్రిని నిర్మించాలి. కుటుంబానికి ప్రత్యేక ఆరోగ్య బీమా కల్పించాలి.
- బీడీ కంపెనీల యాజమాన్యాలు నాసిరకం ముడి సరుకులు సరఫరా చేయకుండా, నాణ్యంగా అందించాలి.
- ప్రస్తుతం వెయ్యి బీడీలకు రూ.245.8 మాత్రమే కూలి ఇస్తున్నారు. దాన్ని రూ. 500 ఇవ్వాలి. ప్రతినెలలో కనీసం 24 రోజులు పని దినాలు కల్పించాలి.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత


నిందితులు, పట్టుకున్న నకిలీ పత్తి విత్తనాలతో పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని ముల్కల్ల శివారులో ఇద్దరు నిందితులు బైక్‌పై తరలిస్తున్న నకిలీ పత్తి విత్తనాలను టాస్క్‌ఫోర్స్ సీఐ సంజయ్, ఎస్సై లచ్చన్న శనివారం పట్టుకున్నారు. వారి కథనం ప్రకారం.. ఇద్దరు నిందితులు జగిత్యాల జిల్లా కోరుట్ల నుంచి మంచిర్యాల వైపు బైక్‌పై రెండు బ్యాగులతో వస్తున్నారు. పక్కా సమాచారంతో తనిఖీ చేయగా రూ.1.80 లక్షల విలువ గల 60 కిలోల నకిలీ పత్తి విత్తనాలను గుర్తించారు. ఇద్దరు నిందితులను అదుపులో తీసుకుని విచారించగా కాసిపేట మండలం తుంగగూడెంకు చెందిన గుండవేణి రాజశేఖర్, ధర్మారావుపేటకు చెందిన ముచ్చెర్ల సంపత్‌గా గుర్తించారు. జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన షాబుద్దీన్ నుంచి తక్కువ ధరకు నకిలీ పత్తివిత్తనాలు కొనుగోలు చేసి జిల్లా పరిధిలోని అమాయక రైతులకు అమ్మేందుకు తీసుకువస్తున్నట్లు తెలిపారు. వారి నుంచి బైక్, 60 కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకుని హాజీపూర్ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ తెలిపారు.

ఒమన్‌లో గల్ఫ్ కార్మికుల సంబురాలు


సంబురాల్లో పాల్గొన్న తెలంగాణ వాసులు


సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు

ఖానాపూర్: రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు పురస్కరించుకుని ఒమన్‌లో గల్ఫ్ కార్మికుల సంబురాలను శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఒమన్ తెలంగాణ సమితి కన్వీనర్ గుండేటి గణేశ్, కోకన్వీనర్ నూనె లక్ష్మణ్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, పాటల పోటీలు, తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు ప్రదర్శనలు చేయడంతో పాటు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

బైక్‌లు ఢీ.. ఒకరి మృతి


ఢీకొన్న బైక్‌లు


మృతి చెందిన కామన్నపటేల్

ముథోల్: రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై సాయికిరణ్ కథనం ప్రకారం..ముథోల్ వైపు నుంచి రెండు బైక్‌లు శనివారం బాసరకు వెళ్తున్నాయి. ముథోల్‌లోని శివాజీ బీడీ కంపెనీ వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బాసర మండలం బిద్రెల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ తపాలా ఉద్యోగి కామన్న పటేల్(69) అక్కడికక్కడే మృతి చెందగా, భైంసాకు చెందిన రాహుల్, నారాయణలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్సులో భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్సై పేర్కొన్నారు.

పొక్లెయిన్ దగ్ధం

- బావోజిపేట్ అటవీప్రాంతంలో ఘటన


దగ్ధమైన పొక్లెయిన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఇచ్చోడ: మండలంలోని బావోజీపేట్ అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో పొక్లెయిన్ దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. టైగర్‌జోన్ అటవీ సిబ్బంది ఆధ్వర్యంలో బావోజీపేట్ అటవీ పరిధిలో రెండు రోజులుగా కందకాలు(బౌండ్రీ ట్రెంచ్) తవ్వుతున్నారు. అక్కడ పోడు రైతులకు అటవీశాఖ సిబ్బంది మధ్య వివాదం నడుస్తోంది. శుక్రవారం ఉదయం సిబ్బంది కందకాలు తవ్వుతుండగా రైతులు పెద్దఎత్తున అక్కడికి చేరుకున్నారు. ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ అక్కడికెళ్లి పోడు రైతులకు ఇబ్బంది పెట్టవద్దని అధికారులకు సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో కందకాలు తవ్వుతున్నట్లు వివరించారు. కాగా, రాత్రి సమయంలో పొక్లెయిన్‌కు నిప్పు పెట్టడంతో అటవీశాఖ, పోడు రైతుల మధ్య వివాదం మరింత జఠిలమైంది. ఈ ఘటనపై టైగర్ జోన్ ఎఫ్ఆర్వో గణేశ్ రాతపూర్వకంగా శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

బాసరకు పోటెత్తిన భక్తులు


క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు


అక్షర శ్రీకారం చేయించుకుంటున్న పిల్లలు


క్యూలైన్లో భక్తులను పర్యవేక్షిస్తున్న ఈఓ

బాసర: వేసవి సెలవులు మరో నాలుగు రోజుల్లో ముగియనుండడం, శని, ఆదివారం సెలవు కావడంతో బాసర జ్ఞాన సరస్వతీ ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి సైతం భక్తులు తరలి రావడంతో ఆలయం కిటకిటలాడింది. ముందుగా గోదావరిలో స్నానాలు ఆచరించి నది తీరాన ఉన్న శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఆలయానికి చేరుకుని దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరారు. అమ్మ వారి దర్శనానికి 2 గంటల సమయం పట్టింది. అనంతరం ప్రత్యేక అక్షరాభ్యాస మండపంలో అక్షర శ్రీకారం, కుంకుమార్చన పూజలు నిర్వహించి. ఈవో విజయ రామారావు ఏర్పాట్లను పరిశీలించారు.

11న హుండీ లెక్కింపు...

బాసర శ్రీజ్ఞానసరస్వతి అమ్మవారికి భక్తులు మొక్కుల రూపంలో సమర్పించిన హుండీ కానుకలను ఈనెల 11న లెక్కించనున్నట్లు ఆలయ ఈవో విజయరామారావు తెలిపారు. ఉదయం 9 గంటలకు ఆలయ ప్రాంగణంలో హుండీ కానుకలు లెక్కిస్తామని పేర్కొన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది, బ్యాంకు సిబ్బంది, పోలీసులు, బాసర, కామారెడ్డి, సిరిసిల్ల జిల్లాలకు చెందిన స్వచ్ఛంద సేవాసమితి సభ్యులు ఈ ప్రక్రియలో పాల్గొంటారని వివరించారు.

13న బహిరంగ వేలం

రాష్ట్ర దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ పరిధిలో ఉన్న 8 దుకాణాల సేల్స్ కౌంటర్లను ఈనెల 13న బహిరంగ వేలం నిర్వహిస్తామని ఈవో విజయరామారావు తెలిపారు. వీటితోపాటు ఆలయ ప్రాంగణంలో పూజా సామగ్రి అమ్మకాలు, కొబ్బరి ముక్కలను పోగు చేసుకోవడానికి కూడా సీల్డ్ టెండర్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రెండు బైక్‌లు ఢీ

తానూరు: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు..హిప్నెల్లితండా గ్రామానికి చెందిన చౌవన్ సాయినాథ్, రాథోడ్ కృష్ణ శనివారం రాత్రి తానూరు నుంచి స్వగ్రామమైన హిప్నెల్లితండాకు బైక్‌పై వెళ్తున్నారు. తానూరు-బెల్‌తరోడా రహదారి హిప్నెల్లితండా బైపాస్ వద్ద మహారాష్ట్ర పాసింగ్ గల బైక్ వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చౌవన్ సాయినాథ్, రాథోడ్ కృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై సందీప్ అక్కడికి చేరుకుని స్థానికుల సాయంతో క్షతగాత్రులను భైంసా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తి పరారైనట్లు స్థానికులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుర్గానగర్ కాలనీకి చెందిన బొజ్జ నర్సింహులు (37) శుక్రవారం రాత్రి విద్యుత్ షాక్‌తో మృతిచెందినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నర్సింహులు ప్రతీరోజు తన ఇంట్లో కూలర్‌లో నీళ్లు పోస్తుండగా విద్యుత్ సరఫరా అయి షాక్ తగిలింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య జ్యోతి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ అశోక్‌కుమార్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల, జగిత్యాల జిల్లాల్లోని పలు మండలాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్ తెలిపారు. శనివారం మంచిర్యాల డీసీపీ కార్యాలయంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. జిల్లాలోని హాజీపూర్, లక్సెట్టిపేట, జగిత్యాల జిల్లాలోని మండలాల్లో తాళం వేసిన ఇళ్లలో నిందితుడి రాత్రి చోరీలకు పాల్పడేవారు. వరుస చోరీలపై ఫిర్యాదులు, నిందితులను పట్టుకునేందుకు మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ పర్యవేక్షణలో మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా రెండు బృందాలు గాలింపు చేపట్టారు. హాజీపూర్ మండలం గుడిపేట శివారులో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వెళ్లేదారిలో ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులో తీసుకుని విచారించగా ఖమ్మం జిల్లా మధిర మండలం ఆత్కూర్ గ్రామానికి చెందిన ఖంభంపాటి యేసోబు అలియాస్ అంగదుల సరేశ్‌రెడ్డి కాగా, ఆరు నెలలుగా పలుచోట్ల చోరీలు చేసినట్లు అంగీకరించారు. బంగారు ఆభరణాలను ఆదిలాబాద్ జిల్లా సోనార్‌కాలనీలో నివాసం ఉంటున్న మమ్మద్వార్ రాహుల్‌కు విక్రయించినట్లు తెలిసింది. వీరి ఇరువురిని అదుపులో తీసుకుని వారి నుంచి రెండున్నర తులాల బంగారం, 15 తులాల వెండి పట్టీలు, రూ. 2,44,660లను స్వాధీనం చేసుకుని రిమాండ్ చేసినట్లు డీసీపీ తెలిపారు.

సీఎంతో ముఖాముఖికి ఎంపికైన విద్యార్థిని


యశస్విని

చెన్నూర్: వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో విద్యాశాఖ నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డితో ముఖాముఖి కార్యక్రమానికి చెన్నూర్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని యశస్విని ఎంపికైనట్లు హెచ్ఎం కొమ్మెర రాధాకృష్ణమూర్తి తెలిపారు. పది ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన ఆమె ఎంపికవడం, ముఖాముఖి అనంతరం విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, హెచ్ఎంలను సన్మానిస్తారని పేర్కొన్నారు. 10న హైదరాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శితోపాటు రాష్ట్ర అధికారులు, హెచ్ఎంలు, తల్లిదండ్రులను సత్కరించి, విద్యార్థులకు వందేమాతరం విద్యాదావ పురస్కారాలు అందిస్తారని పేర్కొన్నారు. యశస్విని మండల విద్యాధికారితోపాటు పట్టణ ప్రముఖులు అభినందించారు.

25 ఏళ్ల కల.. నెరవేరిన వేళ


డీఈవోను కలిసి వినతిపత్రం అందజేస్తున్న భాష పండితులు (ఫైల్)

- పండితులు, పీఈటీ పోస్టుల అప్‌గ్రేడ్
- జిల్లాలో 220 భాష పండితులు, 25 పీఈటీలు
- పదోన్నతులకు మార్గం సుగమం

ఆదిలాబాద్‌టౌన్: భాష పండితులు, పీఈటీల 25 ఏళ్ల కల ఎట్టకేలకు నెరవేరింది. ఈ పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పదోన్నతులకు మార్గం సుగమం కావడంతో వారిలో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నత తరగతులకు బోధిస్తున్నప్పటికి ఎస్జీటీ క్యాడర్‌లో పనిచేస్తుండటం వారిలో తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. పోస్టుల అప్‌గ్రేడ్‌కు గత ప్రభుత్వాలు హామీ ఇచ్చినప్పటికి నెరవేర్చలేదు. ఇందుకు సంబంధించి హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసు ఇటీవల భాషా పండితులు, పీఈటీలకు అనుకూలంగా తీర్పునివ్వడంతో ప్రభుత్వం పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం జరుగనున్న ప్రక్రియలో వారికి పదోన్నతులు లభించనున్నాయి. అయితే కొందరు ఎస్జీటీలు దీనిపై సుప్రీంకోర్టుకు వెళ్లే యోచన చేస్తున్నట్లుగా తెలుస్తోంది. అయితే పదోన్నతుల ప్రక్రియ ముందుకు సాగుతుందా లేక గతంలో మాదిరిగానే ఆగిపోతుందా అనేదానిపై భాష పండితులు, పీఈటీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో విద్యాశాఖ అధికారులు ఆదిశగా కసరత్తు చేస్తున్నారు. సర్టిఫికెట్ల పరిశీలన కోసం చర్యలు చేపడుతున్నారు.

ఏళ్ల నిరీక్షణకు తెర..

భాష పండితులు, పీఈటీలు గత 25 ఏళ్లుగా పదోన్నతుల కోసం నిరీక్షిస్తున్నారు. కోర్టు కేసుల కారణంగా ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. వీరి కంటే జూనియర్లు పదోన్నతులు పొందడంతో వారు నిరుత్సాహంగా ఉన్నారు. గత కొన్నేళ్లుగా ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. గతేడాది పదోన్నతుల ప్రక్రియ జరిగినప్పుడు తాము 6,7 తరగతులకు మాత్రమే బోధిస్తామని సహాయ నిరాకరణకు దిగారు. అయినప్పటికి వారి సమస్య తీరలేదు. పలు ప్రభుత్వాలను కలిసి తమ గోడును విన్నవించుకున్నప్పటికి పదోన్నతులు లభించలేదు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావడంతో వారి సుదీర్ఘ నిరీక్షణకు తెరపడినట్లైంది.

అప్‌గ్రేడ్ అయిన పోస్టులివే

జిల్లాలో భాషా పండితులకు సంబంధించి 248 పోస్టులుండగా 220 పోస్టులను అప్‌గ్రేడ్ చేసింది. అదేవిధంగా 30 పీఈటీ పోస్టులుండగా 25 పోస్టులను అప్‌గ్రేడ్ చేసింది. వీరందరికి పదోన్నతులు లభించనున్నాయి. తెలుగు పండిత్ పోస్టులు 128కి గాను 114 పోస్టులు అప్‌గ్రేడ్ అయ్యాయి. అలాగే హిందీలో 107కు గాను 96 పోస్టులు, ఉర్దూలో 8 పోస్టులకు గాను ఏడు పోస్టులు, మరాఠిలో ఐదు పోస్టులకు గాను 3 పోస్టులు అప్‌గ్రేడ్ అయ్యాయి. పీఈటీ తెలుగు మీడియంలో 27 పోస్టులకు గాను 22 పోస్టులు, హిందీ, ఉర్దూ, మరాఠి మీడియంలో ఒక్కో పోస్టు అప్‌గ్రేడ్ అయ్యాయి.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం


కక్షిదారులతో మాట్లాడుతున్న జడ్జి రవి

చెన్నూర్: లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారమవుతాయని స్థానిక సివిల్ జడ్జి పర్వతపు రవి అన్నారు. చెన్నూర్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీమార్గంతో సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. చెన్నూర్ కోర్టు పరిధిలో 630 కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. వివిధ కేసుల్లో రూ.4.62 లక్షలు, బ్యాంక్ సంబంధిత కేసుల్లో రూ.2.71 లక్షల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఏపీవో ప్రేమలత, ఏజీపీ రాంభావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్‌చందర్‌గిల్డా, పోలీసు అధికారులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.